సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 27 । డిసెంబర్ । 2023

ప్రజల గొంతుకగా..

ప్రజా సమస్యలపై 'సాక్షి'ది అలుపెరగని పోరాటం. జనం గొంతుకగా నిలిచి వాటి పరిష్కారానికి నిరంతరం చొరవ చూపుతోంది. అన్యాయాలను ప్రశ్నిస్తూ.. అక్రమాలను నిలదీస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తుంది. ఈ ఏడాది 'సాక్షి' చొరవతో పరిష్కారమైన సమస్యలు అనేకం ఉన్నాయి. - 8లో



గరిష్టం/కనిష్టం
30.0/16.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి వేళలలో చలి ప్రభావం కొనసాగనుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన 'కంది'



ఠాక్రేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కంది

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల మాజీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్ర యావత్‌మాల్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. నాగ్‌పూర్‌లో ఈ నెల 28న నిర్వహించతలపెట్టిన కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ వేడుకల నిర్వహణ ఏర్పాట్లు, జన సమీకరణపై నిర్వహించిన సమీక్షలో కంది పాల్గొన్నారు. ఆయన వెంట బోథ్ నియోకవర్గ ఇన్‌చార్జి గజేందర్, డీసీసీబీ మాజీ చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన వార్డు అధికారుల నియామకం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ప్రజాపాలన అమలుకు సంబంధించి 49 వార్డులకు ప్రత్యేక వార్డు అధికారులను నియమించారు. ఈ నెల 28నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమ నిర్వహణపై రెవెన్యూ అధికారి జాదవ్ కృష్ణనాయక్ మంగళవారం ప్రత్యేక అధికారులతో మున్సిపల్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. వార్డు అధికారులు తమకు కేటాయించిన కాలనీలో పర్యటించి సభల నిర్వహణ ప్రాంతాలను కౌన్సిలర్‌తో కలిసి గుర్తించాలన్నారు. ఏర్పాటు చేయాల్సిన కౌంటర్లు, ప్రజలకు కల్పించాల్సిన వసతులపై చర్చించి తగు నివేదికలు అందజేయాలని వారికి ఆర్వో సూచించారు. సమావేశంలో ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

నేరడిగొండ: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించడంతో పాటు రోగుల వివరాలను డాక్టర్ సద్దాం ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ఆరోగ్య పర్యవేక్షకులు రాంనరేష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కులమతాలకు అతీతంగా సేవలు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: దారుల్ అన్సార్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా సేవలు అందించనున్నట్లు రాష్ట్ర చైర్మన్ డాక్టర్ అబ్దుల్ ఖుద్దూస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. భిన్నత్వంలో ఏకత్వం నినాదంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అభాగ్యులు, పేదల అభ్యున్నతి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వరకట్న నిషేధానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ చైర్మన్ సయ్యద్ రిజ్వాన్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ నదీమొద్దీన్, ప్రధాన కార్యదర్శి ఖీజర్ యాఫై, ఉపాధ్యక్షులు ఆరీఫ్ ఖాన్, అతఉల్లాఖాన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనవాసీ కళ్యాణ్ పరిషత్ స్థాపన దివస్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్‌లో వనవాసీ కళ్యాణ్ పరిషత్ స్థాపన దివస్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ ప్రాంత కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉన్నత విద్యతోనే అది సాధ్యమన్నారు. పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే వివిధ క్రీడా పోటీలను సైతం నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మురళీధర్, మెస్రం రాజేశ్వర్, అజయ్, భీంరావు పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి



దత్తాత్రేయ స్వామి

జిల్లాలో దత్త జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో గల దత్త మందిర్‌లో స్వామివారికి ఉయ్యాల సేవ చేపట్టారు. అనంతరం దత్తాత్రేయ స్వామి విగ్రహాన్ని పల్లకిలో ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. అర్చకుడు బాలాజీ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

– ఆదిలాబాద్



దత్తమందిర్‌లో ఉయ్యాల సేవ కార్యక్రమంలో పాల్గొన్న యోగానంద సరస్వతి స్వామి, భక్తులు

ప్ఛ్..!



నేరడిగొండ మండలంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

- అన్నదాతకు కలిసిరాని కాలం
- అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- పత్తికి దక్కని మద్దతు ధర
- కొరటా–చనాఖా ద్వారా చుక్కనీరందలే
- డీపీఆర్‌కే పరిమితమైన 'కుప్టి'
- 'వ్యవసాయం' రివైండ్–2023

ఈ ఏడాది అన్నదాతకు కలిసిరాలేదు. భారీ వర్షాలతో చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. మద్దతు ధర సైతం అందని దుస్థితి. ఏటా ఏదో విధంగా రైతు నష్టపోతూనే ఉండగా, ఈసారీ అదే పరిస్థితి. 2023లో అన్నదాతకు కన్నీరే మిగిలింది. రెండేళ్లుగా అతివృష్టితో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఫలితంగా రైతులకు అప్పులే మిగులుతున్నాయి. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 5లక్షల 62వేల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, ఇందులో అత్యధికంగా 3లక్షల 50వేల ఎకరాల్లో పత్తి, లక్ష 20వేల ఎకరాల్లో సోయా సాగైంది. జూలైలో కురిసిన అధిక వర్షాలు పత్తి సాగుపై తీవ్ర ప్రభావం చూపాయి. వానాకాలం సంబంధించి రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ అయినప్పటికీ ప్రస్తుతం యాసంగి డబ్బులు చాలా మంది అకౌంట్లలో జమ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా సాగుపరంగా రైతులు ఈ ఏడాది తీవ్ర నిరాశలో ఉన్నారు. – ఆదిలాబాద్‌టౌన్



కొరటా–చనాఖా బ్యారేజీ (ఫైల్)





పత్తి తూకంలో మోసంపై ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

పత్తికి తీవ్ర నష్టం..
జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. సాధారణంతో పోల్చితే అధిక వర్షం కురిసింది. పత్తి చేలలో నీరు నిల్వ ఉండటంతో రైతులు మరోసారి విత్తనాలు విత్తుకోవాల్సిన పరిస్థితి. ఆ తర్వాత సెప్టెంబర్, అక్టోబర్‌లో పూత, కాత దశలో ఉండగా వర్షాలు లేకపోవడం పంటలపై ప్రభావం చూపింది. ఎకరాకు ఐదు క్వింటాళ్లు మించి దిగుబడి రాలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అధిక శాతంరైతులు పత్తి సాగు చేశారు. గతేడాది అంతర్జాతీయ మార్కెట్లో పత్తికి డిమాండ్ ఉండడంతో క్వింటాలుకు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. మద్దతు ధర రూ.7,020 ఉండగా, ఏ ఒక్క రైతుకు ఆ ధర లభించిన పరిస్థితి లేదు. ఈ ఏడాది సీసీఐ 1లక్ష 80వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, ప్రైవేట్ వ్యాపారులు 2లక్షల 32వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. గతేడాది ప్రైవేట్ వ్యాపారులు జిల్లాలో 19లక్షల 42వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఈ ఏడాది రైతులకు సరాసరి రూ.6,670 ధర లభించింది. గతేడాది మాత్రం రూ.8,100 గిట్టుబాటు కావడం గమనార్హం. ఇటీవల పత్తి తూకంలో మోసంపై రైతులు మార్కెట్ యార్డులో సైతం ఆందోళన చేపట్టారు.

చుక్క నీరందించని ప్రాజెక్టులు..
జిల్లాలో సాగునీరు అందించేందుకు నిర్మాణం చేపట్టిన కొరటా–చనాఖా బ్యారేజీ ద్వారా పంటలకు చుక్కనీరు అందలేదు. ఈ బ్యారేజ్ పనులు 2014లో ప్రారంభించగా, ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాల్వల నిర్మాణం ఇంకా చేపట్టలేదు. భూసేకరణకు నిధులు విడుదల కాకపోవడంతో నిలిచిపోయింది. మొత్తం 13వేల ఎకరాలకు నీరందించాల్సిన ఈ ప్రాజెక్టుకు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే రైతులకు మేలు జరగనుంది. అలాగే కుప్టి ప్రాజెక్టు డీపీఆర్ స్థాయిలోనే పెండింగ్‌లో ఉంది. 2018–19లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నేరడిగొండ మండలాల రైతుల పంట పొలాలకు సాగు నీరు అందనుంది. అలాగే కడెం ప్రాజెక్టులో 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం పెరగనుంది.

కొంతమందికే రైతుబంధు..
యాసంగిలో జిల్లాలో లక్ష 57వేల 548 మందికి రైతుబంధుకు సంబంధించి ప్రభుత్వం రూ.277.31 కోట్లు విడుదల చేసింది. శాసనసభ ఎన్నికల ముందే రైతుబంధు డబ్బులు జమ కావాల్సి ఉండగా, కోడ్‌తో నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రైతుబంధు జమ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తొలుత ఎకరం ఉన్న రైతులకు జమ చేసింది. జిల్లాలో ప్రస్తుతం పది వేల మంది రైతులకు మాత్రమే డబ్బులు జమ కావడంతో మిగతా వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి ఏడాదికి రూ.15వేల చొప్పున జమ చేస్తామని ప్రకటించగా, వచ్చే వానకాలం నుంచి అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 2023లో రైతులకు రైతుబంధు, రైతుబీమా తప్పా మరే పథకం వర్తించలేదు. సబ్సిడీ ద్వారా రైతులకు పరికరాలు అందలేదు. కేంద్ర ప్రభుత్వం పంట బీమా పథకం అమలు చేసినప్పటికీ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ పథకాన్ని అములులోకి తీసుకోలేదు. దీంతో పంటలు నష్టపోయిన రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చిందని పలువురు అన్నదాతలు పేర్కొంటున్నారు.

అమాత్యా.. ఆలకించరూ!

- జిల్లాలో సమస్యలు అనేకం
- పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందని ద్రాక్షే..
- ఏళ్లుగా భర్తీకి నోచుకోని అంగన్‌వాడీ పోస్టులు
- నేడు జిల్లాకు మంత్రి సీతక్క రాక



సీతక్క, రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి

కైలాస్‌నగర్: అడవులు, ఆదివాసీల జిల్లాగా ముద్రపడ్డ ఆదిలాబాద్ అభివృద్ధిలోనూ అంతంతమాత్రమే. ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టినా, కోట్లాది రూపాయల నిధులు వెచ్చించినా ఇప్పటికీ జిల్లా వెనుకబాటు మాత్రం దూరం కావడం లేదు. నాణ్యమైన విద్య, వైద్యం పేదలకు అందని ద్రాక్షగా మారింది. జిల్లాలోని అనేక ఆదివాసీ గూడేలకు కనీసం అంబులెన్స్ వెళ్లేందుకు కూడా సరైన రోడ్డు లేని దుస్థితి. ప్రతీ ఇంటికి శుద్ధజలాన్ని అందించాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ నీరు అందని గూడేలు, తండాలు ఎన్నో ఉన్నాయి. మౌలిక వసతుల సమస్యలకు తోడు ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల దరికి చేర్చాల్సిన జిల్లా స్థాయి అధికారుల పోస్టులు అనేకం ఖాళీగా ఉండడం గమనార్హం. జిల్లా ప్రగతికి ఇవి అవరోధంగా మారుతున్నాయి. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంపై జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. పేదల కష్టాలను తుడిచి వారిని కంటికి రెప్పలా కాపాడుకునే వ్యక్తి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియామకం కావడంతో తమకు కొండంత భరోసా లభించింది దనే నమ్మకంతో ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, నీటి సరఫరా, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖా మాత్యులు ధనసరి అనసూయ (సీతక్క) బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు.

ప్రధాన సమస్యలు కొన్ని..

- జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు భారీగాఖాళీగా ఉన్నాయి. సర్కారు బడుల్లో విద్యాబోధన పై ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎంఈఓ పోస్టులుసైతం భర్తీ కాకపోవడంతోక్షేత్రస్థాయిలో పాఠశాలలపైపర్యవేక్షణ కరువైంది. విద్యా ప్రమాణాలపై తీవ్రప్రభావం చూపుతుంది. మన ఊరు–మన బడి పథకం కింద చేపట్టిన పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. విద్యా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన డీఈవో పోస్టు కూడా ఇన్‌చార్జీతోనే నెట్టుకొస్తున్నారు.
- జిల్లా కేంద్రంలో పేదలకు నాణ్యమైన కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.150 కోట్లతో నిర్మించిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో కోట్లాది రూపాయల ఖరీదైన యంత్రాలు నిరుపయోగంగా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఇప్పటికీ మహారాష్ట్రలోని యవత్మాల్, నాగ్‌పూర్, హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు తరలించాల్సిన దుస్థితి.
- రైతులకు పంట పెట్టుబడి సాయం కోసం అమలు చేసిన రైతుబంధు కింద జిల్లాలో 1లక్ష 56వేల మందికి ఆర్థిక సాయం అందాల్సి ఉండగా, కేవలం 10వేల మంది ఖాతాల్లో మాత్రమే జమ అయ్యాయి. మిగతా రైతులు దిగాలు చెందుతున్నారు.
- జిల్లాలో ఇప్పటికీ అనేక రోడ్లు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా ఆదివాసీ గూడేలు, తండాలకు వెళ్లాలంటే కనీసం ద్విచక్ర వాహనం సైతం వెళ్లలేని దుస్థితి. గర్భిణులు, అత్యవసర పరిస్థితుల్లో రోగులను వైద్యం కోసం ఆస్పత్రులకు తరలించాలంటే అంబులెన్స్ రాని పరిస్థితి ఉంది. మరోవైపు వంతెనలు లేకపోవడంతో వర్షాకాలంలో వాగులు దాటలేక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు సైతం అనేకంగా ఉన్నాయి.
- ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సరిగా అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్‌చేయడంపై హర్షం వ్యక్తమవుతుండగా,ఖాళీగా ఉన్నపోస్టులు వెంటనే భర్తీచేయాలని ప్రజలు కోరుతున్నారు.
- జిల్లాలోని పలు గ్రామాలకు ఇప్పటికీ మిషన్ భగీరథ శుద్ధ జలం అందడం లేదు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గూడేలకు నీటి సరఫరా కావడం లేదు. దీంతో గిరిజనులు ఇప్పటికీ వాగులు, చెలిమె, చేతిపంపులు, బోరుబావుల వద్ద కిలో మీటర్ల మేర నడిచి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి.
- గ్రామాలకు దేవాలయాలుగా భావించే జీపీలకు ఇప్పటికీ పక్కా భవనాలు లేవు. కొన్ని చోట్ల స్థల సమీకరణ సమస్యలు ఉండగా, మరికొన్ని చోట్ల భవన నిర్మాణ పనులు ప్రారంభించినా ఏళ్లుగా పూర్తికాని పరిస్థితి. గ్రామ సభల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

నేడు ఆదిలాబాద్‌కు మంత్రి సీతక్క..
కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క(అనుసూయ) బుధవారం జిల్లాకు రానున్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంపై జిల్లా యంత్రాంగంతో ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో సమీక్షించనున్నారు. అనంతరం కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంపై సమీక్షించడంతో పాటు ప్రజాసేవ భవన్‌లో మీడియా సమావేశంలో పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

'ప్రజా పాలన' పకడ్బందీగా నిర్వహించాలి

- ఈనెల 28 నుంచి జనవరి 6వరకు..
- గ్రామ, మున్సిపల్ పరిధిలో సభలు
- అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

కైలాస్‌నగర్: జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన గ్రామ, వార్డుసభల నిర్వహణపై జిల్లాలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలకు పాలనను చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వరకు పని దినాలలో ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలోని వార్డుల్లో ఈ సభలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, రశీదులు అందించాలన్నారు. మండల పరిధిలో తహసీల్దార్, ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి బృందం రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటించి, ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో కార్యక్రమానికి ఒక రోజు ముందుగానే టామ్‌టామ్ నిర్వహించి, ప్రజలందరికి విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ సభలో టెంట్, తాగునీరు, ఇతర వసతులు కల్పించాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జత చేసేలా దరఖాస్తుదారులకు సూచించాలన్నారు. ప్రజాపాలన సభ నిర్వహణకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని, అలాగే కార్యక్రమంలోవారిని భాగస్వామ్యం చేయాలన్నారు. కౌంటర్ల వద్ద క్యూ పాటించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయి సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రజాపాలన నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు కార్యక్రమ విధి విధానాలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎస్.కిషన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో గణపతి, డీపీవో శ్రీనివాస్, ఆర్డీవో స్రవంతి పాల్గొన్నారు.

'క్లాక్'.. దుమారం!

- వివాదాస్పదంగా వినాయక్‌చౌక్ నిర్మాణం
- క్లాక్‌టవర్ కూల్చివేయాలంటూ ఎమ్మెల్యే ఆదేశం
- వ్యతిరేకిస్తున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- తల పట్టుకుంటున్న బల్దియా అధికారులు



వినాయక్‌చౌక్‌లో నిర్మించిన క్లాక్ టవర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా స్థానిక వినాయక్‌చౌక్‌లోని క్లాక్‌టవర్ నిర్మాణం రాజకీయ దుమారానికి కారణమవుతుంది. ఈ టవర్ కూల్చివేయాలంటూ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇటీవల మున్సిపల్ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే తీరును వ్యతిరేకిస్తుండటం రాజకీయ వేడి రాజేస్తోంది. ఈ క్రమంలో బల్దియా అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రూ.కోటి వ్యయంతో నిర్మాణం..
పట్టణ ప్రగతి నిధులు రూ.కోటి వ్యయంతో వినాయక్‌చౌక్ సుందరీకరణలో భాగంగా 40 అడుగుల ఎత్తులో క్లాక్ టవర్ నిర్మించారు. చుట్టూరా గోడలను అల్యూమినియం కాంపోజిట్ ప్యానల్ (ఏసీపీ క్లాడింగ్)తో చేపట్టారు. టవర్ గోడలకు వినాయకుడి ప్రతిమలతో పైభాగాన గ్లోబు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో ఏటా అట్టహాసంగా నిర్వహించే గణేశ్ నిమజ్జన శోభాయాత్రను ఈ చౌక్‌లోని శిశు మందిర్ నుంచే చేపట్టడంతో ఆరు రోడ్లతో కూడిన ఇక్కడి కూడలి వినాయక్ చౌక్‌గా ప్రసిద్ధి చెందింది. అయితే ఈ చౌక్‌లో వినాయకుడి విగ్రహాన్నే ఏర్పాటు చేయాలంటూ టవర్ నిర్మాణ సమయంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు ఆందోళనలు చేపట్టారు. అందుకు అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న స్పందిస్తూ వినాయకుడి విగ్రహంతో పాటు వినాయక్ చౌక్‌గానే కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కూల్చివేతకు ఎమ్మెల్యే ఆదేశం
ఈ టవర్ నిర్మాణంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారముందని, నిర్మాణం కూడా ప్రణాళికాబద్ధంగా చేపట్టలేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇటీవల బల్దియా అధికారులతో నిర్వహించిన సమీక్షలో అభిప్రాయపడ్డారు. తక్షణమే కూల్చివేయాలని, నిబంధనలు అడ్డంకిగా ఉంటే ప్రభుత్వానికి రాయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అయితే బల్దియా కౌన్సిల్ ఆమోదంతోనే చేపట్టిన టవర్‌ను కూల్చివేయడమేంటని, ఎమ్మెల్యే వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తప్పుపడుతున్నారు. రాజకీయాల కోసం టవర్ కూల్చివేత సరికాదంటున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌ల భిన్నమైన వ్యాఖ్యలతో ఏం చేయాలో తెలియక బల్దియా అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కూల్చివేత సాధ్యమేనా...
ఎమ్మెల్యే ఆదేశాలకనుగుణంగా టవర్ నిర్మాణాన్ని కూల్చివేయడం సాధ్యపడుతుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎందుకంటే నిర్మాణ సమయంలో పలు శాఖల అధికారులతో కూడిన ఓ కమిటీ స్థలాన్ని పరిశీలించి నివేదిక అందజేసింది. తదనుగుణంగా కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారుల అనుమతులు సైతం తీసుకున్నారు. అనంతరమే బల్దియా కౌన్సిల్ తీర్మానంతో టవర్ నిర్మాణం చేపట్టారు. ఇంతటి ప్రక్రియతో చేపట్టిన క్లాక్ టవర్ కూల్చివేత అసలు సాధ్యపడుతుందా సందేహం తలెత్తుతుంది. ఇప్పటికిప్పుడు దాన్ని కూల్చివేయాలంటే రూ.10లక్షలు అవసరమవుతాయని, మరో కొత్త నిర్మాణం చేపట్టాలన్నా రూ.20లక్షలు వెచ్చించాల్సి ఉంటుందని బల్దియా అధికారులు చెబుతుండడం గమనార్హం.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు
ఇటీవల జరిగిన సమావేశంలో క్లాక్ టవర్‌ను కూల్చివేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కౌన్సిల్ తీర్మానంతో ఉన్నతాధికారుల అనుమతితో నిర్మించిన ఈ టవర్ కూల్చివేత సాధ్యపడదు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దానిపై తదుపరి చర్యలు తీసుకుంటాం.

– అరుణ్‌కుమార్, ఏఈ, ఆదిలాబాద్

క్లుప్తంగా

ఉత్పత్తి సంస్థలో మహిళలు భాగం కావాలి

లోకేశ్వరం: ఉత్పత్తి సంస్థలో మహిళా రైతులు సభ్యత్వం తీసుకుని భాగస్వాములు కావాలని రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ముఖ్య కార్యనిర్వహణ అధికారి మేఘన సూచించారు. సభ్యత్వం తీసుకున్న వారు రసాయ, సేంద్రియ ఎరువులు, విత్తనాలు రాయితీపై పొందవచ్చని తెలిపారు. మండలంలోని ధర్మోరలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా మేఘన మాట్లాడుతూ సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పొందడమే కాకుండా పంట అనంతరం కొనుగోలు అమ్మకాలు చేసుకుని లాభం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అరణ్య ఫౌండేషన్ ప్రతినిధి సుమాన్‌కుమార్, నాయకులు మంద భాస్కర్, స్వామిగౌడ్, సునీల్ రెడ్డి, మంద గణేశ్, గంగాధర్ పటేల్, ఆజోబ పటేల్, దేవాగౌడ్, వెంకటేశ్, దిలీప్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెంకటయ్య బావి నవల ఆవిష్కరణ

లక్ష్మీకాపూల్: వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని తెలిపారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్ కుమార్ డబ్బీకా ర్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్స్ కమిటీ ఎన్నిక

మంచిర్యాలటౌన్: ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మండల భాస్కర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా దుర్గం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా దున్న సునిల్ కుమార్, లీగర్ అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా గురునాథం బాబు గౌడ్, ఉపాధ్యక్షులుగా బి.దేవేందర్, వై. రాజశేఖర్ రెడ్డి, ఎస్.జయశీల, రత్నం శ్రీకాంత్, కన్వీనర్‌గా భూపెల్లి మల్లేశ్, కోశాధికారిగా గడ్డం మహవీర్, కార్యదర్శులుగా పానగంటి హరీష్, కొండగూర్ల చంద్రశేఖర్, రజిత, మురళి, అధికార ప్రతినిధులుగా ఎస్. దేవరాజ్, కోకన్వీనర్లుగా గణేశ్, వెంకటేశ్, మారపెల్లి కుమార్, జనార్దన్, కార్యవర్గ సభ్యులుగా గంగారపు నటరాజ్, నెన్నెల నర్సయ్య, నాగ మల్లేశ్, మిట్ట సుజాత, గౌతమ్, రామగోని మహేందర్, అరిగెల నరేశ్ గౌడ్, బి. శ్యాంకుమార్, చిలుముల రమేశ్, నరేశ్, వేముల రాజలింగు, బొల్లం నాగరాజును ఎన్నుకున్నారు.

30 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 30మందికి జరిమానా, ముగ్గురికి సాధారణ జైలు విధిస్తూ.. నిర్మల్ న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ.. పలు వురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరుపరిచారు. 30మందికి రూ.25,700 జరి మానా, ఒక్కొక్కరికీ ఒక రోజు జైలు, ఇద్దరికీ మూడు రోజులు సాధారణ జైలు శిక్ష విధి స్తూ.. స్పెషల్ జ్యూడిషల్ జడ్జి తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపిప్రమాదాలకు కారణం కావద్దని ఎస్సై పేర్కొన్నారు.

ప్రజల గొంతుకగా..

- ప్రజల పక్షపాతిగా కథనాలు..
- స్పందించిన అధికారులు.. అక్రమార్కులపై చర్యలు

ప్రజల సమస్యల పరిష్కారానికి 'సాక్షి' తనవంతుగా కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగానికి సంబంధించి పలు విభాగాల్లో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై దృష్టి సారించి ఏడాది పొడవునా ప్రచురించిన పలు కథనాలకు జిల్లా అధికారులు స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా, అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. 2023లో సాక్షిలో ఎఫెక్ట్ కథనాలు..

– ఆదిలాబాద్‌టౌన్/ఇచ్చోడ/కైలాస్‌నగర్/ఆదిలాబాద్



- విద్యాశాఖలో అక్రమార్కుడు.. అనే కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించారు. సదరు సిబ్బందిని డీఈవో కార్యాలయం నుంచి తొలగించి పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారు.
- రిమ్స్ నుంచి వెళ్లగొడితే ప్రైవేట్‌లో ప్రసవం.. అనే కథనానికి అప్పటి డీఎంఈ స్పందించారు. విచారణ చేపట్టి రిమ్స్‌లోని గైనిక్ విభాగంలో పనిచేసే ఆ వైద్యుడిని తొలగించేలా ఆదేశాలు జారీ చేశారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీకి కేటాయించారు.
- తొమ్మిది మంది టీచర్లకు డిప్యూటేషన్.. అనే కథనానికి డీఈవో స్పందించారు. జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో అక్రమంగా డిప్యూటేషన్ ఇవ్వగా..ఈ కథనానికి స్పందించి వారి డిప్యూటేషన్‌ను రద్దు చేశారు.
- రిమ్స్ అక్రమార్కులపై కలెక్టర్ సీరియస్.. అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. రిమ్స్‌లో పనిచేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి ఓ నిరుద్యోగి నుంచి రూ.లక్ష తీసుకొని ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు.
- మరో వసూల్ రాణిపై.. రిమ్స్‌లో పనిచేసే ఓ ఉద్యోగిని స్టాఫ్ నర్సుల నుంచి రూ.లక్ష 50వేల వరకు డబ్బులు వసూలు చేశారు. ఇంక్రిమెంట్ కల్పిస్తానని చెప్పి ఇబ్బందులకు గురిచేశారు. సాక్షి కథనానికి స్పందించిన డీఎంఈ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ ఉద్యోగిని రిమ్స్ నుంచి డీఎంఈ కార్యాలయానికి సరెండర్ చేశారు.
- నచ్చినట్లు సర్దుబాటు.. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఇచ్చోడ మండలంలోని తలమద్రి పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల కోసం ఏడుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు ప్రచురించడం జరిగింది. ఆ ఇద్దరు విద్యార్థులను వసతిగృహానికి తరలించి ఆ ఉపాధ్యాయులను వేరే పాఠశాలలకు సర్దుబాటు చేశారు.
- బస్సు రాదాయే.. అనే శీర్షికన ఈనెల 11న సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఆర్టీసీ అధికారులు జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్‌కు, సిరికొండ మండలానికి బస్సును పునరుద్ధరించారు.

















- ఆదిలాబాద్ పట్టణం దస్నాపూర్ శివారు సర్వే నెంబర్ 21లోని ప్రభుత్వ అసైన్డ్ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలపై సాక్షి కథనానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పందించారు. వాటిని కూల్చివేశారు.
- ఈకేవైసీ ఇక్కట్లు శీర్షికన ప్రచురితమైన కథనానికి డీఎస్‌వో కిరణ్ కుమార్ స్పందించారు. పట్టణంలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలను సందర్శించి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయించారు.
- అక్రమార్కుల్లో గుబులు శీర్షికన ఈ నెల 11న ప్రచురితమైన కథనం అధికారవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అవినీతికి పాల్పడుతున్న వారిపై ఉన్నతాధికారులు ఆరా తీశారు.
- అస్తవ్యస్తంగా బల్దియా పాలన అనే కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. అన్ని విభాగాల అధికారులకు మెమోలు జారీ చేశారు.

'ఇంజినీరింగ్' ఇచ్చి..



ఉమ్మడి జిల్లాకు ఇంజినీరింగ్ కాలేజీ

నిర్మల్: జూన్ 4న అప్పటి సీఎం కేసీఆర్ సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవ నేపథ్యంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా 'సాక్షి' జిల్లా టాబ్లాయిడ్‌లో 'ఇంజినీరింగ్ ఇవ్వండి సారూ..'శీర్షికన కథనాన్ని ప్రచురించింది. ఇదే విషయాన్ని బహిరంగ సభలో అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లాడు. దీంతో ఆదిలాబాద్ జిల్లాకు జేఎన్‌టీయూ బ్రాంచ్‌ను మంజూరు చేస్తున్నట్లు కేసీఆర్ ప్రకటించారు.

అపరేషన్‌కు అండగా..




కడెం: మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన నాంపల్లి మల్లేశ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపరేషన్‌కు డబ్బులు లేక మంచం పట్టాడు. మల్లేశ్ దీనగాథను 'నా కొడుకును కాపాడండి' అనే శీర్షికన సాక్షి ప్రచురించింది. దీంతో దాతలు స్పందించి సుమారు రెండు లక్షల వరకు అందజేసి మల్లేశ్ అపరేషన్‌కు సహకరించారు.

- బస్సే ఎరుగని పల్లెలు అనే శీర్షికన సాక్షిలో వచ్చిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ నెల 25 నుంచి అల్లంపల్లికి బస్సును ప్రారంభించారు.

సాక్షి ఎఫెక్ట్ కథనాలు

- ఇచ్చోడ మండల కేంద్రంలో నిరుపయోగంగా బస్టాండ్ అనే శీర్షికన మార్చి 21 సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు బస్టాండ్‌ను పునరుద్ధరించారు.
- జూన్ 10వ తేదీన కబ్జాకు గురవుతున్న రో డ్లు శీర్షికన కథనానికి అధికారులు స్పందించి కబ్జాదారులకు నోటీసులు అందచేశారు.
- అక్టోబర్ 23 ఇచ్చోడలో... కంపు కంపు వార్తకు అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించారు.

బస్టాండ్ పునరుద్ధరణ



బస్సు వద్ద కంట్రోలర్లు
ఇచ్చోడ: ఇచ్చోడ బస్టాండ్ ఆవరణను అధికారులు

కబ్జాదారులకు నోటీసులు



ఇచ్చోడ: రోడ్లను కబ్జా చేస్తున్న ఇద్దరికి సోమవారం నోటీసులు అందజేసినట్లు ఇచ్చోడ పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. 'కబ్జాకు గురవుతున్న రోడ్లు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. రెండు రోజుల్లో షెడ్లను తొలగించాలని, లేదంటే చర్యలు

కబ్జాకు గురవుతున్న రోడ్లు



చెత్తాచెదారం తొలగింపు



చెత్తను తొలగిస్తున్న కార్మికులు
ఇచ్చోడ: మండల కేంద్రం

ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: దిలవర్‌పూర్–గుండంపల్లి మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను వెంటనే రద్దు చేయాలని వామపక్ష సంఘాలు డిమాండ్ చేశాయి. ఇథనాల్ పరిశ్రమను రద్దు కోరుతూ వామపక్ష సంఘాల ఆధ్వర్యంలో ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం రౌండ్ టేబు ల్ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప రిశ్రమ ఏర్పాటుతో ప్ర జలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మించిన ఇథనాల్ పరిశ్రమతో అక్కడి ప్రజలు అనేక దుష్పలితాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరిశ్రమ నిర్మాణం పూర్తయితే కాలుష్యంతో పలు గ్రామాల ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు, రైతులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల పోరాటం నేపథ్యంలో పరిశ్రమ రద్దు చేయాని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు ఎస్ఎన్.రెడ్డి, సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కె.రాజన్న, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, తెలంగాణ ప్రజా జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ ఆరేపల్లి విజయ్‌కుమార్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వామపక్షాల నాయకులు

ప్రాణం తీసిన బాబాయ్..

భూ తగాదాలతో దారుణ హత్య

- గొడ్డలితో నరికి.. కత్తితో పొడిచి..
- ఆపై పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు
- అన్నదమ్ముల మధ్య భూవివాదమే కారణం
- పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘటన..



సంఘటన స్థలంలో ఈశ్వర్ మృతదేహం



ఈశ్వర్(ఫైల్)

ఇచ్చోడ: భూవివాదంలో సొంత బాబాయ్ తన కుమారుడితో కలిసి యువకుడిని హత్య చేసిన సంఘటన ఇచ్చోడలో చోటుచేసుకుంది. మూడెళ్లుగా అన్నదమ్ముల మధ్య కొనసాగుతున్న భూ వివాదమే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని సాథ్ నంబర్ గ్రామానికి చెందిన వానోలే కేదోబ, పాండురంగ్‌లు అన్నదమ్ములు. కేదోబ ఐటీడీఏ ఉపాధ్యాయుడిగా పనిచేసి నాలుగేళ్ల కిందట పదవీ విరమణ పొందాడు. పాండురంగ్ ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తూ రెండు నెలల కిందట గుండెపోటు రావడంతో ఫిట్‌నెస్ లేక డ్యూటీకి వెళ్లడం లేదు. ఇద్దరు అన్నదమ్ములకు తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి సాథ్‌నంబర్‌లోని జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. ఈ భూమి తల్లి పేరు మీద పట్టా ఉంది. కానీ గత సంవత్సరం కిందట పాండురంగ్‌కు తెలియకుండానే కేదోబ కుమారుడు ఈశ్వర్ (29) తన తండ్రి కేదోబ పేరిట ఎకరం, కేదోబ చెల్లెలు పేరిట మరో ఎకరం, తన పేరిటా ఎకరం ఇలా నాలుగు ఎకరాల భూమిని విరాసత్ ద్వారా పట్టాలు చేసుకున్నాడు. వారసత్వంగా వచ్చే భూమిలో వాటా ఇవ్వకుండా పట్టా చేసుకోవడంపై ఇద్దరు అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం ప్రారంభమైంది. ప్రస్తుతం భూ వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ విషయంపై చాల సార్లు కుల పెద్దల మధ్య పంచాయితీ కూడా నిర్వహించారు. నెలరోజుల క్రితం ఈశ్వర్ తన తండ్రి కేదోబ పేర్ల మీద ఉన్న భూమిని కోటి రూపాయలకు విక్రయించినట్లు ప్రచారంలో ఉంది. తన వాటా దక్కకుండా భూ వివాదం కోర్టులో ఉండగా విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న పాండురంగ్ ఈశ్వర్‌పై పగా పెంచుకున్నాడు. మంగళవారం ఉదయం 8గంటల ప్రాంతంలో పాండురంగ్ తన కుమారుడు సూర్యకాంత్‌ను తీసుకొని సాథ్‌నంబర్ నుంచి ఇచ్చోడలోని సిరిచెల్మ చౌరస్తాలో ఈశ్వర్ కోసం కాపు కాశాడు. టీచర్స్‌కాలనీలో నివాసముండే ఈశ్వర్ ఉదయం 9గంటల ప్రాంతంలో ఇంటి నుంచి నడుచుకుంటూ సిరిచెల్మ చౌరస్తాలో పాన్‌టేలకు వెళ్లాడు. అక్కడ సమీపంలోని పాండురంగ్, సూర్యకాంత్‌లు ఈశ్వర్‌పై దాడికి ప్రయత్నించారు. దీంతో ఈశ్వర్ తప్పించుకునే క్రమంలో సిరిచెల్మ రోడ్డులోని ప్రభుత్వ ఆస్పత్రి వైపు పరుగులు తీశాడు. పాండురంగ్, సూర్యకాంత్ వెంబడించి సాయిసామత్ ప్రైవేట్ కళాశాల ఎదుట ఈశ్వర్‌ను పట్టుకొని గొడ్డలితో నరికి కత్తితో పొడిచి హత్య చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేష్ తెలిపారు.

వనవాసుల సంక్షేమం కోసం కృషి

నిర్మల్: అడవులనే నమ్ముకుని జీవనం సాగించే గిరి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వనవాసీ కల్యాణ పరిషత్ ఏర్పడిందని పరిషత్ తెలంగాణ ప్రాంత విద్యాప్రముఖ్ మైసర్ల శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం వనవాసీ కల్యాణ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో పరిషత్‌ను ప్రారంభించారని, దీని ద్వారా దేశంలోని 12కోట్ల మంది గిరిజనుల వికాసం కోసం వివిధ కార్యక్రమాలను చేపడుతున్నారని వివరించారు. గిరిజనులకు విద్య, వైద్యం తదితర విషయాల్లో కృషి చేస్తోందన్నారు. గిరిసంస్కృతి, మతమార్పిడులు, పోడుభూములపైనా అవగాహన కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గుద్దేటి నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరుకాగా, పలువురు యువకులు, పరిషత్ బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైసర్ల శంకర్

రెండు ఇళ్లల్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో రెండిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మాదస్తు విజయ్ కుమార్ సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లాడు. అలాగే వారి బంధువులైన మాదస్తు లక్ష్మి సైతం తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. రాత్రి దొంగలు ఈ రెండు ఇళ్లల్లో చొరబడ్డారు. విజయ్‌కుమార్ ఇంట్లోని అరతులం బంగారంతో పాటు నాలుగు తులాల వెండి, రూ.6వేల నగదును ఎత్తుకెళ్లారు. లక్ష్మి ఇంట్లో నుంచి వెండి ఆభరణాలు అపహరించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

తాంసి: మద్యం మత్తులో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కరంజి(టి) గ్రామానికి చెందిన మర్ల మహేందర్(39) వ్యవసాయం చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. అయితే నాలుగేళ్లుగా మద్యానికి బానిసై పనులకు వెళ్లడం లేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో మంగళవారం ఉదయం ఇంటి ఎదుట గల పశువుల పాకలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పురుగుల మందు తాగడంతో చనిపోయే అవకాశం లేదని పాకలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై లాల్ సింగ్ నాయక్ మృతదేహన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంతానం కలగడం లేదని ఉరేసుకుని..

లోకేశ్వరం: సంతానం కలగడం లేదని ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన రామిల్లి సాయిలు(45)కు అనురాధతో వివాహమైంది. ఏళ్లు గడుస్తున్నప్పటికీ సంతానం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయి కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి తీవ్ర గాయాలైన వెంకటకృతిక్(చక్రీ)(19) మంగళవారం మృతిచెందినట్లు ఏఎస్సై మారుతి తెలిపారు. పోలీసులు, కుటుంబీకుల వివరాల ప్రకారం... భైంసా పట్టణానికి చెందిన వెంకటకృతిక్(చక్రీ) సోమవారం ద్విచక్రవాహనంపై నిర్మల్ వైపు వెళ్తుండగా వానల్‌పాడ్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్రగాయాలపాలైన వెంకటకృతిక్‌ను కుటుంబీకులు భైంసాలో ప్రాథమిక చికిత్స అనంతరం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. చక్రీ పంజాబ్‌లో బీఎస్సీ అగ్రికల్చరర్ చదువుతున్నాడు. సెలవుల్లో ఇంటికి వచ్చిన ఇలా మృతిచెందడం కుటుంబీకులను కలిచివేస్తుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.